**రోజూలాగే** ఆ రోజూ ఉదయం తొమ్మిది గంటల సమయంలో పూర్ణశ్రీ హోటల్లోకి వెళుతూ పక్కకు చూశాడు శంకరం.

అలా చూడటం శంకరానికి అలవాటు.

అలా చూచినప్పుడెల్లా అతనికో దృశ్యం కనబడుతుంది. ఆ దృశ్యానికీ, అతనికీ ఏ విధమైన అవినాభావ సంబంధం లేకపోయినా, అతనావూరు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన దగ్గరినుండి ఆ దృశ్యాన్ని చూస్తూనే ఉన్నాడు.

ఆ దృశ్యం—

హోటల్ ముందు, ఫుట్‌పాత్ మీద, కుడి పక్కగా ఒక ఎలక్ట్రిక్ స్తంభానికి ఆనుకొని ఒక ముసలివాడు ఉంటాడు. అతడి ముందు ఒక గుడ్డ పరిచి ఉంటుంది. ఆ గుడ్డమీద కోడి కెలికినట్లుగా చిల్లర పైసలు పడి ఉంటాయి.

ఇక ఆ ముసలివాణ్ణి గురించి చెప్పాలంటే—

అస్థిపంజరం మీద కప్పిన నల్లని గుడ్డలా ముడతలుపడ్డ శరీరం. ఆ ముడతల్లో ఎంతో కాలంనుండి పేరుకుపోయిన మట్టి. తైల సంస్కారం లేని తల. మాసిపోయిన గడ్డం. చిరిగి, చివికిపోయిన అంగవస్త్రంలాంటి ఆచ్ఛాదన. ఇవీ శంకరానికి ఆ ముసలివాడిలో కొట్టవచ్చినట్లు కనుపించిన విషయాలు.

ఆ ముసలివాణ్ణి ప్రొద్దున్నే ఒక పది సంవత్సరాల పిల్ల వెంట తీసుకువచ్చి హోటల్ ముందు కూర్చోబెట్టి, వాడి ముందో మురికి గుడ్డ పరిచి, ఆ గుడ్డ మీద నాలుగు మూలలా నాలుగు రాళ్ళు బరువుగా పెట్టి వెళ్ళిపోతుందనీ—

మధ్యాహ్నం వచ్చి తను తెచ్చిన అన్నం ఆ ముసలివాడికి తినిపించి వెళ్ళిపోతుందనీ—

మళ్ళీ సాయంత్రం వచ్చి, గుడ్డమీద పోగైన చిల్లర పైసల్ని తీసుకొని, గుడ్డ తీసి భుజాన వేసుకొని, ముసలివాణ్ణి ఇంటికి తీసుకువెళుతుందనీ—

శంకరానికి అతని స్నేహితుడు పార్థసారధి చెబితే మొదట్లో తెలిసింది. తరవాత తరవాత అనుభవంమీద తనే తెలుసుకున్నాడు.

అక్కడ ఇది రోజూ జరుగుతున్న తతంగమే.

ఆరోజు కూడా హోటల్లోకి వెళుతూ ఆ ముసలివాణ్ణి చూశాడు శంకరం.

స్తంభానికి చేరగిలబడి ఉన్నాడు ముసలివాడు.

మధ్య మధ్యలో—"అమ్మా! బాబూ! ధర్మం. గుడ్డివాణ్ణి. కళ్ళు లేని కబోదిని. పైసా ధర్మం చేసి పుణ్యం కట్టుకోండి, బాబూ" అంటూ అరుస్తున్నాడు. దీనంగా అర్థిస్తున్నాడు. జాలి కొలిపేలా ప్రాధేయపడి అడుగుతున్నాడు.

హోటల్లోకి వెళ్ళేవాళ్ళు, వచ్చే వాళ్ళు, దారిని పోయేవాళ్ళు, ఎవరికి తోచింది వాళ్ళు ధర్మం చేస్తూనే ఉంటారు.

అయితే—

శంకరం మాత్రం ఆ ముసలివాడికి, ముష్టివాడికి ఏనాడూ ఒక్కపైసా ధర్మం చెయ్యలేదు.

కారణం వాడంటే అతడికి అసహ్యం. నిజం చెప్పాలంటే వాడంటేనే కాదు, అసలు బిచ్చగాళ్ళంటేనే శంకరానికి తగని మంట, అసహ్యం.

వీథుల్లో విచ్చలవిడిగా తిరగటం, దారిని పోయేవారిని అడ్డగించడం, ఎంతో కొంత ధర్మం చెయ్యందే విడిచి పెట్టకుండా ఉండటం, ధర్మం చెయ్యకపోతే విసుక్కోవటం, ధర్మం చెయ్యనివాణ్ణి శపించడం, చేసినవాణ్ణి దీవించడం— నాన్సెన్స్! ఇవన్నీ చూచి చూచి విసిగిపోయాడు శంకరం. అసహ్యాన్ని అధికం చేసుకున్నాడు కూడా.

అందుకే శంకరం బిచ్చగాళ్ళకు దానం చెయ్యడు. చెయ్యడానికి అతగాడి మనసు అంగీకరించదు.

నిజానికి శంకరం ఎంతో ఖర్చు చేస్తాడు. ఆఫ్టరాల్ బిచ్చగాడికి చేసే ధర్మం చిన్నదే అయినా, ఏ నాడూ చెయ్యడు.

అతడు రోజుకు ఆరేడుసార్లు టీ, కాఫీ తాగుతాడు. అప్పుడప్పుడూ ఫ్రెండ్స్‌కు కూడా ఇప్పిస్తూ ఉంటాడు. ఖరీదైన సిగరెట్లు తాగుతాడు. సినిమాలకూ, షికార్లకూ వెళతాడు. డబ్బెంతో ఖర్చు చేస్తాడు. అయినా బిచ్చగాడికి పైసా ఖర్చు చెయ్యడు. అదొక మనస్తత్వం.



# సాటిమనిషి

-డాక్టర్ టి. విమల

ఆ రోజు—

మళ్ళీ లంచ్ టైములో హోటల్‌కు వచ్చాడు టీ తాగటానికి శంకరం. మళ్ళీ ముసలివాణ్ణి చూశాడు.

అయితే ఈసారి ముసలివాడు మామూలుగా స్తంభానికి చేరగిలబడి లేడు. క్రింద పడిపోయి ఉన్నాడు.

అతడి నోటిలోంచి నురగలు కారుతున్నాయి.

వాడి ముందున్న గుడ్డమీద రోజూ కంటే ఈసారి కొంచెం ఎక్కువగానే చిల్లర డబ్బులు పోగయ్యాయి.

ముసలివాడికి ఏమైంది?

చచ్చిపోలేదు గదా?

ఆ ఆలోచన రాగానే ముసలివాడి దగ్గరికి వెళ్ళి చూశాడు శంకరం.

వాడు ఏపలేదు.

ఊపిరి ఉండి ఉండి బలంగా పీలుస్తున్నాడు.

అంటే ఇంకా ముసలివాడిలో ప్రాణం ఉన్నట్లేగదా?

శంకరం లాగే చాలా మంది జనం ఆ ముసలివాడిని చూస్తున్నారు. ఎవరికి తోచిన విధంగా వాళ్ళు కామెంట్ చేస్తున్నారు, వెళ్ళిపోతున్నారు.

కాని, ఎవరూ ఆ ముసలివాడిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

మరి కొద్ది సేపట్లోనే ముసలివాణ్ణి చూసే ప్రేక్షకుల సంఖ్య పెరిగిపోయింది. గుంపులా తయారయ్యారు.

ఆ గుంపులోంచి ఎవరో అంటున్నారు :

"ఇక లాభం లేదు. ముసలివాడు చచ్చిపోతాడు.కాకపోతే కూస్సేపో, కాస్సేపో— అంతే. అయినా ఎండాకాలం. బక్క ప్రాణం. ఎలా తట్టుకుంటూ డతను, పాపం!"

ఇవి కేవలం సానుభూతి వాక్యాలు మాత్రమే.

ఆ మాటలు విన్న తరవాత శంకరానికి కోపం ఫేళ్ళేగి పోయింది.

వెధవలు! అలా సానుభూతి వాక్యాలు వల్లించకపోతే ఆ ముష్టివాడి ముఖాన కాసిని నీళ్ళు చల్లకూడదూ? నోట్లో అన్ని నీళ్ళు పొయ్యకూడదూ? అని తిట్టు కున్నాడు శంకరం లోలోపలే.

అయితే—ఆ వెంటనే తనను తాను విమర్శించుకున్నాడు. వాళ్ళను తిడుతూన్న తను, వాళ్ళను నీళ్ళు చల్లకూడదా అని నిష్ఠూర మాడుతున్న తను ఆ పని ఎందుకు చెయ్యకూడదు? అలా చేస్తే తన అభిమానం దెబ్బ తింటుందా? తనను అందరూ వింతగా చూస్తారనా?

రోజూ తనను చూసే త్రీ స్టార్ హోటల్ వాడూ, అందులో పని చేసే సర్వర్లూ తనను చులకనగా చూస్తారనా? హేళన చేస్తారనా? రోజూ ఇచ్చే మర్యాద ఇకముందు ఇవ్వరనా?

లేక తన హోదా, అంతస్తూ అడ్డ వచ్చా?

ఎందుకు? ఎందుకు?

ఎందుకు తనా పని చెయ్యలేకపోయాడు?

ఆలోచించలేకపోయాడు శంకరం.

అభిమానం అడ్డ వచ్చింది.

ఆలోచనలను తాత్కాలికంగా అణచుకొని హోటల్ లోపలికి నడిచాడు.

టీ, బిస్కట్లు తీసుకొని, బేరర్ టిప్పు చెల్లించి బయటికి వచ్చాడు.

సిగరెట్ వెలిగించి హోటల్ ముందు నిలబడ్డాడు.

ముసలివాడి చుట్టూ జేరిన జనం పలచబడింది.

మరో పది నిమిషాలు గడిచాయి.

బయట ఎండ మండిపోతూంది.

సూర్యుడు లోకంమీద తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

ఇక ఆఫీసుకు వెళ్ళిపోతే?—అనుకున్నాడు శంకరం.

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి డ్రెయినేజిలో విసిరి కొట్టాడు.

ముందుకు రెండడుగులు వేశాడు.

ఇంతలో—

అటువైపు నుంచి నడుచుకుంటూ ఎవరో ఒక కుర్రవాడు హోటల్ దగ్గరికి వచ్చాడు.

వాణ్ణి శంకరం గమనించాడు.

వాడికి పది పన్నెండు సంవత్సరాలు ఉంటాయి. చిరిగిపోయిన నిక్కరూ, చొక్కా తైల సంస్కారం లేని జుట్టూ, చంకలో చోలీ, చేతిలో ఒక చిన్న డబ్బా.

శంకరం చూస్తూనే ఉన్నాడు ఆ కుర్రవాణ్ణి.

ఆ కుర్రవాడు ముసలివాణ్ణి చూశాడు. ఒక్క క్షణం ఏదో ఆలోచించాడు. ఆ వెంటనే ఏమనుకున్నాడో, ఏమో? గబ గబ ముసలివాడి దగ్గరికి నడుచుకుంటూ వెళ్ళి, ముసలివాడి చేతిని తన చేతిలోనికి తీసుకొని, తరవాత నాడి చూసి ఆ తరవాత ముక్కు దగ్గర తన చేతిని పెట్టి గాలి పీల్చుకుంటున్నాడో, లేదో పరీక్షించినట్లు ఉన్నాడు.

ఆ తరవాత "తాతా! తాతా!" అంటూ కంగారుగా పిలిచాడు, ఆ పన్నెండేళ్ళ కుర్రవాడు.

ముసలివాడు పలకలేదు కాని, 'దాహం' అన్నట్టుగా నోరు తెరిచి, నాలుక బయట పెట్టి సైగ చేశాడు.

ఆ కుర్రవాడు గుబుక్కున లేచి, పక్కనే ఉన్న హోటల్‌లోకి వెళ్ళి, తన దగ్గర ఉన్న డబ్బా నిండుగా నీళ్ళు తెచ్చి ముసలివాడిచేత తాగించాడు. మిగిలిన నీళ్ళు ముఖంమీద జల్లాడు.

అయినా ముసలివాడిలో చలనం లేదు. తేరుకోలేదు.

కాని, తనకు దాహం తీర్చిన ఆ కుర్రవాడు ఎవరై ఉంటాడు? తన కోసం దేవుడు పంపిన దేవదూత కాదుకదా? అనే ఆలోచనలో పడినట్లున్నాడు ముసలి వాడు—కళ్ళు పత్తి గింజల్లా తెరుచుకొని ఆ కుర్రవాణ్ణే చూస్తున్నాడు వింతగా, విచిత్రంగా.

ఆ కుర్రవాణ్ణే చూస్తూంటే ముసలివాడికి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఆ దృశ్యాన్ని చూస్తున్న ఆ కుర్రవాడికీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మరో అయిదు నిమిషాల తరవాత ఏమనుకున్నాడో, ఏమో, ఆ కుర్రవాడు లేచి, ఆ పక్కనే ఉన్న రిక్షాస్టాండు వైపు పరుగెత్తుకు వెళ్ళి, ఏదో మాట్లాడి ఒక రిక్షాను పిలుచుకు వచ్చాడు.

"తాతా!...తాతా! లే, ఆసుపత్రికి వెళదాం" అంటూ పిలిచాడు.

ముసలివాడు కదలలేదు.

ఆ కుర్రవాడు రిక్షావాడిని ఉద్దేశించి—"రిక్షా బాబూ! కాస్తంత సాయం చేయి. తాతని లేపలేకపోతున్నాను" అన్నాడు దీనంగా, ప్రాధేయ పూర్వకంగా.

వాడి పలుకుల్లో అభ్యర్థన ఉంది.

కాదనలేకపోయాడు రిక్షావాడు.

రిక్షావాడి సాయంతో ముసలివాణ్ణి రిక్షాలో కూర్చోబెట్టి, అతడి పక్కనే అతణ్ణే పట్టుకొని కూర్చున్నాడు కుర్రవాడు.

రిక్షా కదిలింది.

అప్పటివరకూ ఏదో సినిమా చూస్తున్నట్లు నిలబడిపోయిన శంకరం, ఒక్క సారిగా సుషుప్తి నుండి మేల్కొన్నట్లు ఉలిక్కిపడి, వడి వడిగా నడుచుకుంటూ రిక్షా దగ్గరికి వెళ్ళాడు.

"ఒరేయ్! అబ్బీ! ఆ ముసలివాడు నీకేమవుతాడ్రా?" అని ఆ కుర్రవాణ్ణి అడిగాడు శంకరం.

ఆ ప్రశ్న అడిగిన శంకరాన్ని క్రింది నుండి పైకి ఒకసారి చూచి అన్నాడు కుర్రవాడు—"సాటి మనిషి, బాబూ!"

ఆ మాట వింటూనే కళ్ళు గిర్రున తిరిగాయి శంకరానికి.

అప్పుడే అనిపించింది—

ఈ చదువు, ఈ సంస్కారం ఎవరిని ఉద్ధరించడానికి?

ఈ ఉద్యోగాలూ, ఉక్కైలటాలూ ఏ ప్రగతిని సాధించడానికి?

తోటి మనిషిని మనిషిగా ఆదరించలేని, గౌరవించలేని మనిషి మనిషేనా?

ఆ వెంటనే తనను తాను గుర్తు తెచ్చుకున్నాడు, శంకరం.

తన మీద తనకే అసహ్యం పుట్టింది.

★